క్లుప్తంగా

రేపటి నుంచి పవిత్రోత్సవాలు

చిట్టమూరు: మండల పరిధిలోని మల్లాం గ్రామంలో స్వయంభువుగా కొలువైన వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నుంచి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శశాంక్ శుక్రవారం తెలిపారు. స్వామి, అమ్మవార్ల బ్రహ్మోత్సవాలు ముగిసిన తర్వాత ఆలయంలో పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆలయ సంప్రదాయమని పేర్కొన్నారు. 12వ తేదీ ఆదివారం ఉదయం విఘ్నేశ్వర పూజతో పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 13వ తేదీ సోమవారం వాస్తు పూజ, రక్షాబంధనం, 14 మంగళవారం గోపూజ, నవగ్రహ హోమం, పవిత్ర ప్రతిష్ఠ పూజ, పవిత్రాల సమర్పణ, కలశాభిషేకం ఉంటుందని తెలిపారు. భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చిల్లకూరు: రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు మండలంలోని కడివేడు గ్రామానికి చెందిన మణి బైక్‌పై గూడూరుకు బయల్దేరారు. వరగలి క్రాస్ రోడ్డు వద్ద సర్వీస్ రోడ్డులో బైక్ అదుపు తప్పి పక్కనే ఉన్న కాలువ గట్టును ఢీ కొంది. తీవ్రంగా గాయపడిన మణిని ఆస్పత్రికి తరలించారు.

ఎన్‌బీకేఆర్‌లో క్యాంపస్ సెలక్షన్స్

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో శుక్రవారం స్నోవాసిస్ కంపెనీ క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించింది. బీటెక్ ఫైనలియర్ సీఎస్‌ఈ, ఈసీఈ, ఐటీ అండ్ ఏఐడీఎస్ విద్యార్థులు 430 మంది క్యాంపస్ సెలక్షన్స్‌కు హాజరయ్యారు. కంపెనీ ప్రతినిధులు నాలుగు రౌండ్లలో ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారి వివరాలను త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

పౌష్టికాహారంపై అవగాహన

దొరవారిసత్రం : మండలంలోని వేణుంబాకం, రాజుపాళెం గ్రామాల్లో శుక్రవారం పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా ఆయా ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బిడ్డ తల్లులకు పౌష్టికాహారంపై ఐసీడీఎస్ అధికారులు అవగాహన కల్పించారు. కేంద్రాల్లో సరఫరా చేసి పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ జ్యోతికిరణ్ తెలిపారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

సైదాపురం: పంటలు సాగు చేసే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏఓ హైమావతి కోరారు. మండలంలోని కలిచేడు, మలిచేడు గ్రామాల్లో శుక్రవారం రైతు సేవాకేంద్రాలను పరిశీలించారు. అనంతరం రబీ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు పలు సూచనలు, సలహాలను అందజేశారు. విత్తనాల నుంచి కోత వరకు తప్పని సరిగా వ్యవసాయాధికారులను సంప్రదించాలని కోరారు.

గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందాలి

ఓజిలి: గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందేలా ప్రణాళికలు తయారుచేయాలని ఎంపీడీఓ నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ కార్యక్రమంపై మండల అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి, పనితీరులో పురోగతిని అంచనా వేయడం కోసమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. సామాజిక, ఆర్థిక సూచకలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణారెడ్డి, డీఎల్‌పీఓ రవీంద్రబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్, ఈఓపీఆర్డీ రేణుక పాల్గొన్నారు.

డీఈఓకు స్వల్ప అస్వస్థత

చిల్లకూరు: కౌన్సెలింగ్ నిర్వహణలో చిత్తూరు జిల్లా విద్యాశాఖాధికారి వరలక్ష్మి తీవ్ర ఒత్తిడికి గురై మెట్లెక్కుతూ కింద పడిన సంఘటన శుక్రవారం గూడూరు ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో చోటుచేసుకుంది. కళాశాలలో నూతనంగా ఎంపికైన డీఎస్సీ ఉపాధ్యాయులకు (ఎస్‌జీటీ)కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. ఈ క్రమంలో ఆమె ఎస్‌జీటీ తమిళ, ఉర్దూ పోస్టింగులకు నియమితులైన 175 మంది ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ ఉదయం 8 గంటలకు ఆరంభించాల్సి ఉంది. అయితే 12 గంటలు అవుతున్నా ఆరంభం కాక పోవడంతో ఉన్నతాధికారులు ఆమెపై ఒత్తిడి తెచ్చారు. రాష్ట్ర విద్యాశాఖ ఐటీ విభాగం, జిల్లా విద్యాశాఖ మధ్య సమన్వయ లోపంతో ఖాళీలు ఎక్కడ ఉన్నాయనే విషయాలను ప్రచురించలేక పోయారు. దీంతో కౌన్సెలింగ్ ప్రకియ ఆలస్యం అయ్యింది. దీనికితోడు ఉన్నతాధికారులు ఒత్తిడితో ఆమె మెట్లెక్కుతూ తుళ్ళి పడిపోయారు. సిబ్బంది ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కోలుకున్న అనంతరం చిత్తూరులోని ఆమె ఇంటికి తరలించారు.

చికెన్ ధరలు		11-10-2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	113
లేయర్ లైవ్	:	122
బ్రాయిలర్ చికెన్	:	206
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	230
లేయర్ చికెన్	:	207

అల్లుకున్న ముప్పు

ఓజిలి: మండలంలోని సగుటూరు, నెమళ్లపూడి, చిలమానుచేను, ఆర్మేనిపాడు, భువనగిరిపాళెం, గుర్రంకొండ తదితర గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలు చోటుచేసుకునేలా దర్శనమిస్తున్నాయి. వర్షాకాలం ప్రారంభం కావడంతో పిచ్చిమొక్కలు పెరిగి ఏపుగా పెరగడంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలకు తీగలు అల్లుకుంటున్నాయి. కొన్ని పిచ్చిమొక్కలు నేలపైనుంచి విద్యుత్ తీగలకు అల్లుకుంటూ చుట్టేస్తున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. విద్యుత్ స్తంభాలు నిలబడేందుకు ఏర్పాటు చేసిన స్టేవైర్‌కు తీగలు అల్లుపోయి, ప్రమాదకరంగా మారాయి. పశువులు తీగలను తినేందుకు స్టేవైర్ తాకగానే షాక్‌తో విగతజీవులుగా మారుతున్నాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చేతికందే ఎత్తులో ఉన్నాయి. ఇలాంటి ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద గడ్డి పెరిగి, పిచ్చిమొక్కలు మొలవడంతో వాటిని తినేందుకు పశువులు వెళ్లి విద్యుత్‌షాక్‌కు గురై మృత్యువాత పడుతున్నాయి. సగుటూరు ఎస్సీ కాలనీలో ప్రజలు నివసించే ఇళ్లపై వైర్లు వెళ్తున్నాయి. ఈ విద్యుత్ తీగలతో ఇటీవల ప్రమాదం సంభవించింది. విద్యుత్‌శాఖ అధికారులు వెంటనే స్పందించి పిచ్చిమొక్కలు, తీగలతో అల్లుకున్న విద్యుత్‌వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లను గుర్తించి తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



పున్నేపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో స్వర్ణముఖి బ్రిడ్జి వద్ద విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగలు



సగటూరుకు వెళ్లే తెలుగుగంగ కాలువ వద్ద..



నెమళ్లపూడి ఎస్టీ కాలనీకి వెళ్లే రోడ్డు పక్కన,



చిలమానుచేను గ్రామానికి వెళ్లే మార్గంలో,



సగుటూరు శివాలయం పక్కనే అల్లుకున్న తీగలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిల్లకూరు: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. పోటుపాళెం, ముత్యాలపాడు, నాంచారమ్మపేట, చిల్లకూరు, ఎగువరాజుపాళెం, దిగువ రాజుపాళెం, మర్లమిట్ట, తీపనూరు, నెలబల్లిరెట్టపల్లి, ఓడూరు, పున్నపువారిపాళెం, బూదనం , కడివేడు, తిమ్మనగారిపాళెం, కమ్మవారిపాళెం, గుత్తావారిపాళెం గ్రామాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు.

సూళ్లూరుపేట : పట్టణంలోని మన్నేముత్తేరి, మన్నారుపోలూరు, చెంగాళమ్మ ఆలయం సమీపంలో వున్న 33-11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ మురళి తెలియజేశారు. పట్టణంలో ఎక్కడ కరెంట్ ఉండదని, విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించి తగిన విధంగా అంటే ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన కోరారు.

దొరవారిసత్రం: మండలంలోని దొరవారిసత్రం, తల్లంపాడు ప్రాంతాల్లోని 33/11కేవీ సబ్ స్టేషన్లలో మరమ్మతులు, నిర్వహణ కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు విద్యుత్ సరఫరా ఉండదని స్థానిక ఏఈ జగదీష్ తెలియజేశారు.

14, 15 తేదీల్లో శిక్షణ తరగతులు

రాపూరు: మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు 14, 15 తేదీల్లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భవాని తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు పంచాయతీల్లో వనరులు ఎలా సమకూర్చుకోవాలన్న దానిపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు.

వివాదాస్పద భూమిలో ప్రవేశిస్తే చర్యలు



కుమ్మరిపాళెంలో గ్రామసభ నిర్వహిస్తున్న తహసీల్దార్

చిట్టమూరు: మండల పరిధిలోని బీజీకే పాళెం పంచాయతీ కుమ్మరిపాళెం గ్రామంలో ఉన్న వివాదాస్పద భూమిలోకి ప్రవేశిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ నరేష్ సూచించారు. కుమ్మరిపాళెం గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ ఆధ్వర్యంలో గ్రామస్తులతో శాంతి సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం అసైన్‌మెంట్ భూమిని గ్రామంలోని అన్ని వర్గాలకు చెందిన 9 మంది రైతులకు సర్వే నెంబర్ 16లో ఉన్న 27.06 ఎకరాలను పంపిణీ చేసిందన్నారు. ఈ భూమిలో ఒక్కో రైతు 2.5 ఎకరాలు మాత్రమే సాగు చేసుకుని మిగిలిన భూమిని గ్రామంలో భూమి లేని రైతులకు వదిలేయాలని సూచించారన్నారు. అయితే అప్పట్లో భూమిని తీసుకున్న వారసులు ప్రస్తుతం తమకు ప్రభుత్వం 5 ఎకరాలు పంపిణీ చేసిందని ఆ భూమి మొత్తం తమకే చెందుతుందని పొలంలో ప్రవేశించారన్నారు. దీంతో గ్రామంలో గొడవలు చోటు చేసుకుని ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారని చెప్పారు. దీంతో గ్రామంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వివాదాస్పద భూమిలోకి ఎవరూ ప్రవేశించకూడదని తెలియజేశామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డీటీ నిరంజన్, ఆర్ఐ సుధా పాల్గొన్నారు.

కేజీబీవీలో బాలికా దినోత్సవం



బహుమతులందుకున్న విద్యార్థినులతో అతిథులు, ఉపాధ్యాయులు

తడ: అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం తడ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు బాలికలను ఉద్దేశించి ప్రసంగించారు. విద్య వల్ల కలిగే ప్రయోజనాలను అతిథులు విద్యార్థినులకు వివరించారు. విద్యార్థినులకు డ్రాయింగ్, వ్యాసరచన, నాటికల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడంతోపాటు దీనికి హాజరైన అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ వేములు, సూళ్లూరుపేట ప్రభుత్వ వైద్యురాలు లావణ్య, తడ ఉన్నత పాఠశాల హెచ్ఎం హరిత, ఉపాధ్యాయులు చెంగయ్య పాల్గొన్నారు.

నిత్య వ్యాయామం తప్పనిసరి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాజేష్

గూడూరురూరల్ : మానసిక వైకల్యంతో బాధపడేవారికి ప్రతి రోజూ వ్యాయామం తప్పనిసరి అని సీనియర్ సివిల్ జడ్జి రాజేష్ తెలిపారు. గూడూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో వరల్డ్ మెంటల్ హెల్త్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో జడ్జి రాజేష్ మాట్లాడుతూ 1996 నుంచి వరల్డ్ మెంటల్ హెల్త్ డే కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మానసిక వైకల్యం ఉన్న వారు ప్రతిరోజు తప్పనిసరిగా వ్యాయామం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భారతి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉమా శంకర్, సీనియర్ అడ్వకేట్ గోపికృష్ణ, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ కోటేశ్వరరావు, ఎస్ఐ తిరుపతయ్య, బీసీ హాస్టల్ వార్డెన్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

14న బుద్ధుడి విగ్రహావిష్కరణ

కలువాయి(సైదాపురం): గౌతమ బుద్ధుడి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బుంతేజి దమ్మానంద మత గురువు పిలుపునిచ్చారు. కలువాయి మండలం ఏడీపీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ డక్కిలి మండలం వెంబులూరు గ్రామంలోని అంబేడ్కర్ నగర్‌లో ఈనెల 14న బుద్ధుడి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. నాగపూర్‌పట్టణంలో 1956 అక్టోబర్ 14వ తేదీన బీఆర అంబేడ్కర్ బౌద్ధ ధర్మం స్వీకరించారని చెప్పారు. కార్యక్రమంలో ఏడీపీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిట్టేటి రమణయ్య, నిజమాల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నిరసన జయప్రదం చేయండి

గూడూరురూరల్ : సీజేఐపై దాడి యత్నాన్ని ఖండిస్తూ పద్మశ్రీ మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు ఈనెల 13న జిల్లా కలెక్టరేట్, 17న మండల కార్యాలయాల ముందు జరిగే నిరసన ప్రదర్శనలను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ తిరుపతి జిల్లా ఇన్‌చార్జి వర్ల దేవదాసు మాదిగ పిలుపునిచ్చారు. గూడూరు పట్టణంలోని ఎన్.జి.ఓ. హోంలో శుక్రవారం సాయంత్రం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్ జిల్లా కార్యకర్తల అత్యవసర సమావేశం నిర్వహించారు. జిల్లా అధికార ప్రతినిధి గొల్లపల్లి సిసింద్రీ మాదిగ మాట్లాడుతూ సీజేఐపై దాడికి యత్నించిన న్యాయవాదిపై సుమోటోగా కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు



ఎంపికైన డివిజన్ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ జట్టు

గూడూరురూరల్ : పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో మూడు రోజులపాటు నిర్వహించిన అండర్-14, అండర్-17 ఆరు క్రీడాంశాల్లో బాలబాలికలకు నిర్వహించిన డివిజన్ స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. డివిజన్ స్థాయిలో విజేతలై జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 20 నుంచి నెల్లూరులో జరిగే జిల్లా స్థాయి ఎంపికల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ డివిజనల్ కో-ఆర్డినేటర్ పఠాన్ కరిముల్లాఖాన్ తెలిపారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి సనత్‌కుమార్, ఎంఈఓ రవీంద్ర బాబు, పాఠశాల హెచ్‌ఎం భారతి, డీఆర్‌డబ్ల్యూ కళాశాల ప్రిన్సిపల్ హనుమంతరావు, వ్యాయామ ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, సుధాకర్, భాస్కర్, సురేష్‌బాబు, రమేష్‌బాబు, శీను, మహిపతి పాల్గొన్నారు.

ప్రొ కబడ్డీ పోటీలకు మహిళ ఎంపిక



శ్రీదేవి

వెంకటగిరి రూరల్ : మండలంలో ప్రొ- కబడ్డీ లీగ్ పోటీలకు మండలంలోని 9వ బెటాలియన్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ రవికుమార్ సతీమణి శ్రీదేవి ఎంపిక ఎయ్యారు. ఢిల్లీలో నిర్వహించనున్న ప్రొ కబడ్డీ పోటీలలో తిరుపతి జిల్లా తరపున శ్రీదేవి పాల్గొననున్నారు.

ఊబకాయం తగ్గించుకోవాలి

చిల్లకూరు: కాన్పులు జరిగిన తరువాత పలువురు మహిళలు ఊబకాయంతో ఇబ్బంది పడుతుంటారని అలాంటి వారు పౌష్టికాహారం ద్వారా ఊబకాయం తగ్గించుకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు ఉండవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీ హైమావతి సూచించారు. గూడూరు పట్టణంలోని నరశింగారావు పేట సెక్టార్ పరిధిలోని బ్రహ్మంగారి మఠం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం రాష్ట్రీయ పోషణ మాసోత్సవంలో భాగంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

ఆరోగ్య సూత్రాలను తప్పక పాటించాలి

ఓజిలి: గర్భవతి ఉన్నప్పుడు తల్లి ఆరోగ్యసూత్రాలు తప్పక పాటించాలని ఇన్‌చార్జి వైద్యాధికారి దయాకర్ రెడ్డి అన్నారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్ష యోజన పథకంలో భాగంగా 30 మంది గర్భిణులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈయన వెంట సీహెచ్‌ఓ సుబ్బరామయ్య, సిబ్బంది ఉన్నారు.

పొదుపు సభ్యులు అధిక ఆదాయం పొందాలి

ఓజిలి: పొదుపు సంఘాల్లోని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో పెరటికోళ్లను శుక్రవారం ఎంపీపీ పంపిణీ చేశారు. ఏపీఎం పద్మమ్మ మాట్లాడుతూ పొదుపు సంఘాల్లోని మహిళలకు 100 యూనిట్ల పెరటికోళ్లను అందిస్తున్నామన్నారు. పున్నేపల్లి, అత్తివరం గ్రామాల్లో పెరటికోళ్లను పొదుపు మహిళలకు పంపిణీ చేశారు.

పారిశుధ్య పనుల పరిశీలన

కలువాయి(సైదాపురం): కలువాయి పంచాయతీలో పారిశుద్ధ్య పనులను శుక్రవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ శైలజ పర్యవేక్షించారు. బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయరాదని తడి చెత్త, పొడిచెత్త వేరుగా ఉంచాలని స్థానికులకు సూచించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్ సుధాకర్, జూనియర్ అసిస్టెంట్ శ్రీను పాల్గొన్నారు.

ఉద్యోగులు జవాబుదారీగా ఉండాలి

డక్కిలి: ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా సరే ప్రజలకు జవాబుదారీగా ఉంటూ విధులు నిర్వహించాలని ఎంపీడీఓ రవీంద్రబాబు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీల అభివృద్ధి సూచికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది తీరుపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. ఇకపై ఫిర్యాదులు రాకుండా అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవలన్నారు. ఎంపీపీ గోను రాజశేఖర్ మాట్లాడుతూ ప్రజలు సచివాలయానికి వచ్చిన వారి పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తే సచివాలయ వ్యవస్థకు చెడ్డపేరు వస్తుందని, తీరు మార్చుకోవాలని చెప్పారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.34 కోట్లు

నాయుడుపేటటౌన్ : నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపాలిటీల అభివృద్ధికి 34 కోట్లు నిధుల మంజూరైనట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ వెల్లడించారు. పట్టణంలోని ఎల్ఏ సాగరం బీడీ కాలనీ వద్ద బీపీఎస్-ఎల్ఆర్ఎస్ నిధులు రూ.2 కోట్లతో నిర్మించే సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపికతో కలిసి భూమి పూజ చేశారు.

కార్యకర్తలకు శ్రీరామ రక్ష.. డిజిటల్ బుక్



డిజిటల్ బుక్ ఆవిష్కరిస్తున్న నేతలు

సైదాపురం: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు డిజిటల్ బుక్ ఓ శ్రీరామ రక్షలా ఉపయోగపడుతుందని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మన్నారపు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కన్వీనర్ స్వగృహంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను మండల నేతల సమక్షంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తిరకాల భాస్కర్, వివిధ విభాగాల కన్వీనర్లు నలమారు రామ్‌గోపాల్‌రెడ్డి, మాలకొండరెడ్డి, గుంటమడుగు శ్రీనివాసులురాజు, విజయభాస్కర్ రెడ్డి, బట్టేపాటి దయాకర్‌రెడ్డి, కమలపూడి సుబ్బారెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు గోగినేని శివకుమార్, మోహన్‌రావు, బీఎస్‌యాదవ్, రాజశేఖర్‌నాయుడు, రాజారెడ్డి, షాకీర్, అనంతమడుగు ఎంపీటీసీ వెంకటరమణయ్య, ఎం పెంచలయ్య, ఈశ్వరయ్య, ఏడుకొండలు, కుంచం సుబ్బయ్య, బొలిగర్ల శివకుమార్‌యాదవ్, ఓబులునాయుడు తదితరులున్నారు.

రాయల్‌గుంట పనుల్లో గందరగోళం



యంత్రాలను అడ్డుకొని అధికారులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

పెళ్లకూరు: మండలంలోని అనకవోలు పంచాయతీ పరిధిలో ఉన్న వెంకటరాయల్ గుంట సరిహద్దు పనులు శుక్రవారం అటు అధికారులు, ఇటు గ్రామస్తుల నడుమ వాగ్వివాదాలు, తోపులాటలతో తీవ్ర ఉత్కంఠ మధ్య మొదలయ్యాయి. వివరాల్లోకి వెళితే గ్రామంలోని 9.37ఎకరాల విస్తీర్ణంలో వెంకటరాయల్‌గుంట ఉంది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్ డీఈ విశ్వనాథ్ ఆధ్వర్యంలో రెవెన్యూ యంత్రాంగం సర్వే చేసి సరిహద్దులు ఏర్పాటు చేశారు. యంత్రాలతో గుంట సరిహద్దులకు ట్రెంచ్ వేస్తున్న సమయంలో అనకవోలు, పెరుమాళ్లపల్లి గ్రామస్తులు యంత్రాలను అడ్డుకొని నిలిపేశారు. స్థానిక ఎస్ఐ నాగరాజు తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని వివాదాలు తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు నచ్చచెప్పి సరిహద్దు పనులు పూర్తి చేశారు.

టపాసు దుకాణాల పరిశీలన



చెందోడులో టపాసుల గోదామును పరిశీలిస్తున్న తహసీల్దార్

కోట: మండలంలో వెంకన్నపాళెం, చెందోడులో బాణసంచా, టపాసుల విక్రయ కేంద్రాలను శుక్రవారం తహసీల్దార్ జయజయరావు, ఎస్ఎఫ్ఓ శ్రీనివాసులు పరిశీలించారు. గోదాముల్లో నిల్వ ఉన్న బాణసంచాను పరిశీలించారు. కోటలో టపాసుల విక్రయ కేంద్రాలన్నీ ఒకే చోట ఏర్పాటు చేసుకునేందుకు వ్యాపారులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. నిబంధనల మేరకు వ్యాపారులు తమ లైసెన్సులను రెన్యువల్ చేసుకోవాలని సూచించారు.

మత్తు పదార్థాల వాడకంతో భవిష్యత్ నాశనం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి

వాకాడు: మత్తు పదార్థాల వాడకం వలన విలువైన భవిష్యత్ నాశనం అవుతుందని దుగ్గరాజపట్నం మెరైన్ సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకం వలన జరిగే అనేక అనర్థాలను వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని తమ తల్లిదండ్రులు కన్న కలలను నెరవేర్చే దిశగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కిషోర్, మెరైన్ ఎస్ఐ సౌమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

వెంకటగిరి రూరల్: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల పట్ల తల్లిదండ్రులు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్యానల్ న్యాయవాది గాంధీ పేర్కొన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమీపంలో ఉన్న భవిత కార్యాలయంలో శుక్రవారం ప్రపంచ మానసిక వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. చిన్నారులకు ఫిజియోథెరపీతోపాటు సృజనాత్మకతను పెంపొందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న భాస్కర్

సూళ్లూరుపేట: స్థానిక లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మన్నారుపోలూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. చిత్తూరు మెడికల్ కళాశాలకు చెందిన ప్రముఖ మానసిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ భాస్కర్ నాయుడు ఈ సదస్సులో పాల్గొని విద్యార్థులకు విద్యాపరమైన మానసిక ఒత్తిళ్లు వచ్చినపుడు వాటిని ఎలాంటి ఎదుర్కోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజియన్ సెక్రటరీ డాక్టర్ ఆదిశేషారెడ్డి, అధ్యక్షులు లలిత, సెక్రటరీ అరుణకుమారి, కోశాధికారి జానకి, స్కూల్ ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.